క్లుప్తంగా

దోమల నివారణకు చర్యలు



వన్‌టౌన్‌లో దోమల నివారణకు ఫాగింగ్ చేస్తున్న నగర పాలక సిబ్బంది

కర్నూలు (న్యూటౌన్): కర్నూలు నగరంలో గత కొన్ని రోజులుగా దోమల వృద్ధి నివారణకు కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ చర్యలు చేపట్టారు. ఐదు ఆధునిక ఫాగింగ్ మిషన్లు కొనుగోలు చేసి కర్నూలు నగరంలో విస్తృతంగా ఫాగింగ్‌కు చర్యలు చేపట్టారు. తుంగభద్ర, హంద్రీనది, కేసీ కెనాల్ పరివాహక కాలనీల్లో దోమల వ్యాప్తి ఎక్కువగా ఉండడంతో కర్నూలు నగర పాలక సంస్థ మలేరియా విభాగం సిబ్బంది ముమ్మరంగా ఫాగింగ్ చేపడుతున్నారు.

గ్రానైట్ స్లాబ్స్ లారీ సీజ్

కర్నూలు (న్యూటౌన్): ప్రకాశం జిల్లా బూదగోడ నుంచి గోవాకు గెలాక్సీ గ్రానైట్ స్లాబ్స్‌ను రాయల్టీ రవాణా పత్రాల్లో అనుమతించిన పరిమాణం కంటే అత్యధికంగా తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ టి రాజశేఖర్ తెలిపారు. గ్రానైట్ స్లాబ్స్‌ను అనుమతులకు మించి లారీలో తరలిస్తున్నారనే సమాచారంతో ఆదివారం తెల్లవారు జామున ఓర్వకల్లు మండలం నన్నూరు టోల్ ప్లాజా వద్ద ఆకస్మికంగా దాడి చేశారు. లారీని సీజ్ చేసి రూ.1,01,100 అపరాధ రుసుం విధించి వసూలు చేశారు. తనిఖీల్లో జిల్లా మైనింగ్ విజిలెన్స్ ఏడీ బైరాగి నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ మురహరి, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ వీఏఓ మృతి



మృతుడు రఘునాథరెడ్డి(ఫైల్)

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామానికి చెందిన మాజీ గ్రామ పరిపాలనాధికారి(వీఏఓ) వై.రఘునాథరెడ్డి(83) అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు. రఘునాథ్‌రెడ్డి గతంలో భైరాపురం, లొద్దిపల్లె గ్రామాలలో వీఏఓగా సేవలందించి, 12 ఏళ్ల క్రితం పదవీవిరమణ పొందారు. ఆయన గత కొంతకాలంగా అనారోగ్యంతో కర్నూలులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకోండి

సి.బెళగల్: మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, మల్లేశ్వరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని గొల్లలదొడ్డి గ్రామంలో అంగన్‌వాడీ వర్కర్ (టీచర్) పోస్టు ఖాళీగా ఉందని, విద్యా అర్హతలుండి గ్రామానికి చెందిన ఎస్సీ మహిళలు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. అలాగే..గుండ్రేవుల - 1 కేంద్రంలో బీసీ-బీ, కొత్తకోట- 4లో ఓసీ, తిమ్మందొడ్డిలో ఈడబ్ల్యూఎస్, మారందొడ్డి- 2లో ఓసీ అంగన్‌వాడీ హెల్పర్లు ఖాళీగా ఉన్నాయని, అర్హులైన మహిళలు దరఖాస్తులను చేసుకోవాలని సూచించారు. అభ్యర్థులు 21- 35 సంవత్సరాలలోపు వయస్సు కలిగి, స్థానికులై, 10వ తరగతి ఉత్తీర్ణత సాధించి ఉండాలని పేర్కొన్నారు. దరఖాస్తులను ఈనెల 7వ తేదీ లోపు కోడుమూరులోని సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

కల్లూరు: ఉలిందకొండ పోలీసు స్టేషన్ పరిధిలోని కొల్లంపల్లితండా గ్రామ పరిసరా ప్రాంతాల్లో తొమ్మిది సారాబట్టీలపై దాడి చేసి, 2,500 లీటర్ల బెల్లం ఊటను పోలీసులు ధ్వంసం చేశారు. ఆదివారం జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు ఉలిందకొండ ఇన్‌చార్జ్ ఎస్‌హెచ్‌ఓ (ట్రైనింగ్ డీఎస్పీ) భావన ఆధ్వర్యంలో ఎస్‌ఐ నరేష్, పోలీసు సిబ్బందితో కలసి దాడులు నిర్వహించారు. అక్రమంగా నాటుసారా తయారు చేయడానికి ఏర్పాటు చేసుకున్న సారాబట్టీలను ధ్వంసం చేశారు. గ్రామాలలో శాంతి భద్రలతకు భంగం వాటిల్లితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

భక్తి శ్రద్ధలతో కలశయాత్ర

కర్నూలు కల్చరల్: వాసవీ దీక్షా సమితి ఆధ్వర్యంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో కలశ యాత్ర నిర్వహించారు. ఉత్తరాయణం హేమంత రుతువు పుష్యమాసం బహళ నవమిని పురస్కరించుకొని ఓల్డ్‌సిటీలోని రాంబొట్ల దేవాలయం నుంచి చిన్న అమ్మ వారి శాల వరకు కలశ యాత్ర చేశారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్య స్వామి, టీడీపీ కర్నూ లు నియోజకవర్గ ఇన్‌చార్జ్ టీజీ భరత్, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు గోరంట్ల రమణ, వాసవి దీక్షా సమి తి ప్రతినిధి శేషగిరి శెట్టి కలశ యాత్ర ప్రారంభించారు. అనంతరం చిన్న అమ్మవారి శాలలో వాసవి మాతకు అభిషేకం నిర్వహించారు. సోమవారం ఉదయం 10 గంటలకు కలశ స్థాపన, 12 గంటలకు పూర్ణాహుతి కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు పేర్కొన్నారు. సమితి సభ్యులు, పాల్గొన్నారు.

ప్రగతి పథంలో చనుగొండ్ల



నిర్మితమైన గ్రామ సచివాలయ భవనం



రైతు భోరోసా కేంద్రం

- గ్రామంలో రూ.3 కోట్లకు పైగా వెచ్చించి అభివృద్ధి పనులు
- సచివాలయాలు, ఆర్‌బీకే, విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటు
- దశాబ్దాల నాటి నీటి సమస్యకు పరిష్కారం
- సీసీ రోడ్లు, డ్రైనేజీల ఏర్పాటుతో తొలగిన మురుగు సమస్య

గూడూరు రూరల్: వైఎస్సార్‌సీపీ పాలనలో గ్రామాలు ప్రగతి పథంలో దూసుకెళ్తున్నాయి. ఏళ్లుగా అపరిష్కృతంగా ఉండిపోయిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపారు. ఇంతకు ముందెన్నడూ చేయని విధంగా కోట్లాది రూపాయలతో పనులు చేపట్టారు. రూ.1.40 కోట్లతో సచివాలయం, ఆర్బీకే, వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రం, విలేజ్ క్లినిక్ తదితర కార్యాలయాలకు భవనాలు నిర్మించారు. అలాగే ఉద్యోగులను నియమించడంతో గ్రామానికి కొత్త కళ వచ్చినట్లయ్యింది. ముఖ్యంగా మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యతనిచ్చి పనులు చేపట్టారు. మంచినీటి ఎద్దడి నివారణ, సీసీ రోడ్లు, డ్రైనేజీలు వంటి పనులను చేశారు. రెండు గ్రామ సచివాలయాలు, రైతులకు వ్యవసాయానికి అవసరమైన ఎరువులు, విత్తనాలు,పంట కొనుగోలు, మద్దతు ధర వంటివి కల్పించేందుకు రైతు భరోసా కేంద్రాలు, పేదలకు ఉచితంగా వైద్యం, మందులు అందించేందుకు విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటయ్యాయి. గ్రామంలో 5వేలకు పైగా జనాభా ఉన్నా దశాబ్దాలుగా మంచినీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దాదాపు రూ.40 లక్షలతో బోర్లు, పైపులైన్ పనులతో పాటు కాలనీల్లో నూతన మినీ ట్యాంకుల ఏర్పాటు చేశారు. అలాగే కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయించడంతో మురుగు సమస్య తొలగింది. నాడు-నేడు కింద రెండు ప్రాథమిక, ఒక ఉన్నత పాఠశాలల్లో వసతులు కల్పించడానికి రూ.కోటికి పైగా ఖర్చు చేసింది. ఏళ్లగా ఉండిపోయిన సమస్యలు పరిష్కారమవడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బీసీ కాలనీలో ఏర్పాటు చేసిన మినీ ట్యాంకు



మంచినీటి కోసం వేసిన బోరు

ఆసుపత్రికి వెళ్లి పింఛన్ అందజేత

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌కు చెందిన ఫించన్ లబ్ధిదారుడు, వైఎస్సార్‌సీపీ మండల కార్యదర్శి రామకృష్ణ తండ్రి చాకలి పెద్ద మాదన్న అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వ ఆసుత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సతీష్ ఆదివారం ఆసుపత్రికి చేరుకుని బాధితుడి పరామర్శించారు. అలాగే గ్రామ వలంటీర్ విజయలక్ష్మితో కలిసి పింఛన్ పంపిణీ చేశారు. కర్నూలు వైఎస్సార్‌సీపీ నాయకుడు సంపత్ తదితరులు ఉన్నారు.

దేవరగట్టుకు వెళ్లి పింఛన్ అందజేత

కోడుమూరు రూరల్: మండలంలోని ముడుమలగుర్తి గ్రామానికి చెందిన బోయ లక్ష్మి ఆరోగ్యం సరిగా లేక కుమార్తెతో పాటు దేవరగట్టులో ఉంటోంది. విషయం తెలుసుకున్న వలంటీర్ సురేష్.. గ్రామ సచివాలయ కన్వీనర్ మధుతో కలిసి సుమారు వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవరగట్టుకు వెళ్లి పింఛన్ అందజేశారు.



చాకలి పెద్ద మాదన్నకు పింఛన్ అందజేస్తున్న డాక్టర్ ఆదిమూలపు సతీష్, వలంటీర్ విజయలక్ష్మి



బోయ లక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సురేష్

ఆహారంలో మార్పులతో గుండె పదిలం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పూర్వ జిల్లా కలెక్టర్ రామశంకర్‌నాయక్

కర్నూలు(హాస్పిటల్): ఆహారంలో కొద్దిగా మార్పులు చేసుకుంటే గుండె పదిలంగా ఉంటుందని పూర్వ జిల్లా కలెక్టర్ రామశంకర్‌నాయక్ చెప్పారు. కర్నూలు హార్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్ క్లబ్‌లో గుండెజబ్బులపై ఆరోగ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రామశంకర్‌నాయక్ మాట్లాడుతూ తాను జిల్లా కలెక్టర్‌గా ఉన్న సమయంలో పది మందికి ఉపయోగపడుతుందని కర్నూలు హార్ట్ ఫౌండేషన్‌కు ఎ.క్యాంపులో క్వార్టర్ల స్థలం మంజూరు చేశానన్నారు. అందులో హెల్త్ క్లబ్ ఏర్పాటు చేసి ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉండటం అభినందనీయమన్నారు. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స తీసుకోవడం కన్నా రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం మేలని చెప్పారు. ఈ మేరకు జీవనశైలితో పాటు ఆహారంలో మార్పులు చేసుకోవాలన్నారు. ప్రతిరోజూ వ్యాయామం తప్పనిసరిగా చేయాలని సూచించారు. బయటి ఆహారానికి సాధ్యమైనంత దూరంగా ఉండాలని, వీలైతే స్వయంగా వండుకుని తినాలని చెప్పారు. వంటింట్లోని ఆహార దినుసుల్లో చాలా ఆరోగ్యాన్నిచ్చే పదార్థాలు ఉన్నాయని, వాటిని ఉపయోగించుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. అనంతరం ఫౌండేషన్ కార్యదర్శి, సీనియర్ కార్డియాలజిస్టు డాక్టర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ గుండెపోటుకు సంబంధించి ఆరోగ్య అవగాహన కల్పించారు. రామశంకర్‌నాయక్‌ను హార్ట్ ఫౌండేషన్ కోశాధికారి కేపీ రాముడు, సభ్యులు లక్ష్మన్న, ఎలమర్తి రమణయ్య, ఎల్లయ్య తదితరులు ఘనంగా సన్మానించారు.

ఇళ్ల స్థలాలపై పేదలకు సంపూర్ణ హక్కులు



బిలకలగూడూరు సచివాలయంలో రిజిస్ట్రేషన్ అనంతరం పట్టాలు అందజేస్తున్న దృశ్యం

గడివేముల: ఇళ్లు లేని నిరుపేదలకు ఇచ్చిన స్థలాలకు రిజిస్ట్రేషన్ ద్వారా సంపూర్ణ హక్కులు ప్రభుత్వం కల్పిస్తున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ పోగుల చంద్రశేఖరరెడ్డి తెలిపారు. ఆదివారం మండల పరిధిలోని బిలకలగూడూరు సచివాలయంలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇళ్లు లేని పేదలకు 257 ఇంటి పట్టాలను పంపిణీ చేయడం జరిగింది. జగనన్న కాలనీలో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని, ఆ స్థలాలకు భవిష్యత్‌లో సంపూర్ణ హక్కులు కల్పించేందుకు రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారన్నారు. ఇప్పటి వరకు 75 ఇళ్ల స్థలాలకు రిజిస్ట్రేషన్ పూర్తయినట్లు చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో వీఆర్వో క్రిష్ణ, పంచాయతీ కార్యదర్శి షబానా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అత్యధిక మరణాలకు కారణం క్యాన్సర్

కర్నూలు(హాస్పిటల్): దేశంలో అత్యధిక మరణాలకు కారణమవుతున్న వ్యాధుల్లో క్యాన్సర్ అగ్రస్థానంలో ఉందని మెడికల్ ఆంకాలజిస్టు డాక్టర్ రాఘవేందర్‌రెడ్డి చెప్పారు. వరల్డ్ క్యాన్సర్ డేను పురస్కరించుకుని ఆదివారం స్థానిక మెడికవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో క్లోస్ ది కేర్ గ్యాప్ అనే థీమ్‌తో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఏటా కోటి మంది క్యాన్సర్‌తో మరణిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మన దేశంలో ప్రతి సంవత్సరం 11 లక్షల మందికి క్యాన్సర్ సోకుతోందని చెప్పారు. నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, కడుపు క్యాన్సర్ మొదటి వరుసలో ఉంటున్నాయని తెలిపారు. సరైన అవగాహన లేకపోవడం, నిరక్షరాస్యత, భయం, వివిధ రకాల అపోహల వల్లే క్యాన్సర్ నిర్ధారణ ఆలస్యమవుతోందని చెప్పారు. కార్యక్రమంలో హాస్పిటల్ సెంటర్ హెడ్ పి. నీలారెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వీఆర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో...

స్థానిక ప్రకాష్‌నగర్‌లోని వీఆర్ మల్టీస్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రపంచ క్యాన్సర్ అవగాహన దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి వచ్చిన వారికి క్యాన్సర్ నిర్ధారణకు ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ సి. వాసురెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందే గుర్తించి చికిత్స తీసుకుంటే ప్రాణాపాయం ఉండదన్నారు. కానీ చాలా మంది చివరి దశలో వస్తున్నారని, దీనివల్ల ప్రాణా పాయం రిస్క్ కాస్త ఎక్కువగా ఉంటుందని తెలిపారు.

ఒమెగా హాస్పిటల్ ఆధ్వర్యంలో...

నగరంలోని ఒమెగా హాస్పిటల్, క్యాన్సర్ సొసైటీ ఆఫ్ కర్నూలు, రవీంద్ర విద్యాసంస్థలు, పుల్లయ్య ఇంజినీరింగ్ కళాశాలల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం స్థానిక సి.క్యాంపు నుంచి ఒమెగా హాస్పిటల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని రవీంద్ర విద్యాసంస్థల అధినేత జి.పుల్లయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చక్కటి జీవనశైలి, క్రమశిక్షణతో మన ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఆదిత్య, డాక్టర్ వై. వెంకటరామిరెడ్డి, డాక్టర్ బి. రవీంద్ర బాబు, డాక్టర్ సుధీర్‌రెడ్డి, డాక్టర్ యు. ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ముమ్మరంగా తరగతి గదుల నిర్మాణం



పెసరవాయి ఎంపీయూపీ పాఠశాల అదనపు గదులకు స్లాబ్ వేస్తున్న దృశ్యం

గడివేముల: మండల పరిధిలోని పెసరవాయి ఎంపీయూపీ పాఠశాలలో తరగతి గదులు శిథిలావస్థకు చేరడంతో ప్రభుత్వం నూతన గదులను మంజూరు చేసినట్లు వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా యూత్‌వింగ్ సెక్రటరీ ద్వారం శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం పనులు ముమ్మరంగా సాగుతున్నాయన్నారు. ఆదివారం నూతన గదులకు స్లాబ్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పాఠశాలల గురించి పట్టించుకోలేదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన అనంతరం విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆయన ప్రత్యేక చొరవతో ఐదు గదులకు రూ.59 లక్షలను నాడు-నేడు కింద మంజూరు చేయడం జరిగిందన్నారు. తరగతి గదులను త్వరలోనే విద్యార్థులకు అందుబాటులోకి తీసుకోస్తామన్నారు. స్లాబ్ పనులను పంచాయతీరాజ్ ఏఈ భాస్కర్ పరిశీలించారు.

దూదేకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలి



అంబేద్కర్ విగ్రహం ముందు మౌన దీక్ష చేస్తున్న దూదేకుల సంఘాల నాయకులు

కర్నూలు (అర్బన్): రానున్న ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు దూదేకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ నూర్‌బాషా / దూదేకుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పీర్ మహమ్మద్ కోరారు. ఆదివారం జిల్లా పరిషత్ ప్రాంగణంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దూదేకులకు రాష్ట్ర వ్యాప్తంగా 5 ఎమ్మెల్యే, 2 ఎంపీ స్థానాలు కేటాయించాలన్నారు. దూదేకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించే పార్టీలకే తాము మద్దతిస్తామన్నారు. అనంతరం అక్కడి నుంచి దూదేకుల సంఘం నాయకులు పాతబస్టాండు అంబేడ్కర్ విగ్రహం వరకూ ర్యాలీ నిర్వహించి విగ్రహం ముందు ప్లకార్డులు పట్టుకుని మౌన నిరసన దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు, రిటైర్డ్ డీఎస్పీ మహబూబ్‌బాషా, కార్యదర్శి సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల హామీలన్నీ అమలు

- సిద్ధం పోస్టర్ ఆవిష్కరణలో కోడుమూరు నియోజకవర్గ సమ్వనయకర్త ఆదిమూలపు సతీష్



సిద్ధం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డా.ఆదిమూలపు సతీష్, తదితరులు

కర్నూలు సిటీ: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి దేశానికే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలిచారని కోడుమూరు నియోజకవర్గ సమన్వయకర్త డా.ఆదిమూలపు సతీష్ అన్నారు. ఆదివారం కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని 38వ వార్డులో సిద్ధం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సీఎంగా చేసుకునేందుకు పార్టీ క్యాడర్ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికెళ్లి వివరించాలన్నారు. పేదలకు జరుగుతున్న మేలును చూసి ప్రతిపక్ష పార్టీలు ఓర్వలేకపోతున్నాయన్నారు. ఎన్నికలకు ప్రతి కార్యకర్త, నాయకులు సిద్ధం కావాలన్నారు. కార్యక్రమంలో 40వ వార్డు కార్పొరేటర్ విక్రమసింహా రెడ్డి, పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవలను విస్తృతం చేయాలి




మాట్లాడుతున్న సత్యసాయి సేవా ట్రస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్ర

కర్నూలు కల్చరల్: సత్యసాయి సేవా ట్రస్ట్ సేవలను మరింత విస్తృతం చేయాలని ట్రస్ట్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేంద్ర పేర్కొన్నారు. ఆదివారం నెహ్రూనగర్‌లోని సత్యసాయి మందిరంలో జిల్లా స్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సత్యసాయి సంస్థను మరింత బలోపేతం చేయాలన్నారు. సేవా కేంద్రాలను పెంచాల్సిన అవసరం ఉందన్నారు. శతాబ్ది ఉత్సవాలు సమీపిస్తున్న తరుణంలో ట్రస్ట్ కార్యక్రమాలు పెంచాలన్నారు. ఆధ్యాత్మిక, సామాజిక సేవలతో భక్తులకు చేరువ కావాలన్నారు. సమావేశంలో సేవా విభాగం రాష్ట్ర అధ్యక్షుడు శ్యామ్, ట్రస్ట్ జిల్లా అధ్యక్షుడు మాకా అశోక్ కుమార్, సభ్యులు సాయిబాబా, సరోజ, కృష్ణారెడ్డి, సూర్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హరినామ సంకీర్తనతో ప్రశాంతత





జగన్నాథ్, సుభద్ర, బలదేవ్ మూర్తులకు పూజలు చేస్తున్న దృశ్యం, శ్రీకృష్ణ కథను ఆలకిస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: హరినామ సంకీర్తన జపంతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఇస్కాన్ బాధ్యుడు రామకృష్ణ ప్రభు అన్నారు. ఇస్కాన్ ఆధ్వర్యంలో స్థానిక భగీరథ కాంప్లెక్స్‌లోని జగన్నాథ మందిరంలో ఆదివారం భగవద్గీత శిక్షణ తరగతులు, శీల ప్రభుపాద ప్రేమ విందు కార్యక్రమాలు జరిగాయి. రామకృష్ణ ప్రభు మాట్లాడుతూ నిత్యం భగవద్గీతను పఠనం, శ్రవణం చేయాలన్నారు.దీని వల్ల ఎన్నో క్లిష్ట సమస్యలకు పరిష్కారం దొరుకుతుందన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ మంత్రాన్ని జపం చేయించారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆర్‌డీఓ హరిప్రసాదుకు వీడ్కోలు



ఆర్‌డీఓ దంపతులను సన్మానిస్తున్న డీఆర్వో కె.మధుసూదన్‌రావు, రెవెన్యూ సిబ్బంది

కర్నూలు(సెంట్రల్): కర్నూలు ఆర్‌డీఓగా పనిచేసి బదిలీపై మదనపల్లెకు వెళ్తున్న సి.హరిప్రసాదుకు తోటి ఉద్యోగులు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఆదివారం ఆర్‌డీఓ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి డీఆర్వో కె.మధుసూదన్‌రావు, తహసీల్దార్లు, పలువురు రెవెన్యూ సిబ్బంది హాజరై ఆర్‌డీఓ దంపతులను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ కరోన సమయంలో, భూ రీసర్వేలో, పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ, 22ఏ జాబితా నుంచి అసైన్డ్ భూముల తొలగింపులో ఆయన తీసుకున్న చొరవ, పోషించిన పాత్రను కొనియాడారు. కాగా హరిప్రసాదు స్థానంలో కర్నూలుకు నరసరావుపేట ఆర్‌డీఓగా పనిచేస్తున్న ఎం.శేషిరెడ్డిని బదిలీ చేశారు. ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

8న మండల సర్వసభ్య సమావేశం

కోడుమూరు రూరల్: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో ఎంపీపీ గాడి రూతమ్మ అధ్యక్షతన ఈనెల 8వ తేదీన మండల సర్వసభ్య సమా వేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దీప్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు హాజరు కావాలని, ఆయా శాఖల మండల అధికారులు, సిబ్బంది తమ ప్రగతి నివేదికలతో తప్పక హాజరు కావాలని సూచించారు.

నేడు కోడుమూరులో స్పందన

కోడుమూరు రూరల్: ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ తహసీల్దార్ రామాంజనేయులు ఆదివారం తెలిపారు. ఇందుకు మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

స్పందనకు హాజరవ్వండి

సి.బెళగల్: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమానికి మండల అధికారులందరూ తప్పనిసరిగా హాజరవ్వాలని డిప్యూటీ తహసీల్దార్ కృష్ణమూర్తి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. గైర్హాజరయ్యే అధికారులపై చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని పేర్కొన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గూడూరు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని డిప్యూటీ తహసీల్దార్ శారద ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి అధికారులందరూ హాజరు కావాలని కోరారు.

ధర్మకర్త మండలి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

ఓర్వకల్లు: మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాల్వబుగ్గ దేవస్థానంలో నూతన ధర్మకర్త మండలి సభ్యుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం నియమించిన ధర్మకర్త మండలి గడువు కాలం ఈ నెల 23వ తేదీకి ముగుస్తున్న నేపథ్యంలో కొత్త పాలక వర్గ సభ్యులకు అవకాశం కల్పిస్తున్నట్లు దేవదాయ, ధర్మదాయ శాఖ కమిషనర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. నిబంధనల మేరకు మొత్తం 9 మంది సభ్యులతో కూడిన పాలక మండలి సభ్యులు ఈ నెల 3వ తేదీ నుంచి 23వ తేదీలోగా పూర్తి చేసిన దరఖాస్తులను డీసీ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

8న కాల్వబుగ్గ హుండీ ఆదాయం లెక్కింపు

ఓర్వకల్లు : మండలంలోని కాల్వబుగ్గ వెలసిన శ్రీబుగ్గరామేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 8వ తేదీన హుండీ ఆదాయం లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది జూన్ మాసం నుంచి స్వాముల వారికి భక్తులు సమర్పించిన కానుకలను, హుండీలోని నగదు ఉదయం 10.30 గంటలకు ఆలయ ధర్మకర్త మండలి సమక్షంలో లెక్కింపు కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి బాలాజీ సేవా ట్రస్టు వారు కూడా హాజరుకానున్నట్లు తెలిపారు. ఆసక్తి గల భక్తులు కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా కోరారు.

ఫిజియోథెరపీని సద్వినియోగం చేసుకోండి

సి.బెళగల్: దివ్యాంగుల ఉపయోగార్థం నిర్వహించే ఫిజియోథెరపీ శిబిరాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జ్యోతి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక భవిత కేంద్రంలో సోమవారం దివ్యాంగులకు వైద్యుడు వీరేష్ ఫిజియోథెరపీ నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ట్యాంక్ ధ్వంసంపై ఫిర్యాదు

పాణ్యం : మండల కేంద్రమైన పాణ్యంలోని బీసీ కాలనీలో ఉన్న మంచినీటి మినీ ట్యాంక్‌ను ఓ వ్యక్తి జేసీబీతో ఆదివారం కూల్చివేశాడు. దీంతో ఆగ్రహించిన ప్రజలు అతనిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు బీసీ కాలనీలో మంచినీటి కోసం గ్రామపంచాయతీ మినీ ట్యాంక్‌లను ఏర్పాటు చేసింది. అయితే ట్యాంక్ పక్కనే ఉన్న ఓ వ్యక్తి స్థలంలోకి నీరు వస్తున్నయనే నెపంతో జేసీబీ సహాయంతో ట్యాంకును తొలగించాడు. దీంతో ప్రజలు పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. వేసవి కాలం సమీపిస్తున్న తరుణంలో నీటి ట్యాంక్‌లను తొలగించడంపై ప్రజలు మండిపడుతున్నారు. ఎవరి అనుమతి లేకుండా కూల్చివేశారని, అధికారులు చర్యలు తీసుకోని నీటి ట్యాంక్‌ను యథావిధిగా ఉంచాలని కోరుతున్నారు.

వృద్ధుల ఆశ్రమంలో నూతన వస్త్రాల పంపిణీ

కర్నూలు(అర్బన్): నగరంలోని బి. క్యాంప్ అమ్మ వృద్ధుల ఆశ్రమంలో ఆదివారం వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం రాష్ట్ర కార్యదర్శి దేవపూజ ధనుంజయ ఆచారి, ఆయన సతీమణి లక్ష్మీదేవి వృద్ధులకు నూతన వస్త్రాలు, బియ్యం, పండ్లు, బిస్కెట్ ప్యాకెట్లు, స్టీల్ గ్లాసులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కుమారుడు దేవపూజ దినేష్ 28వ జయంతిని పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు.

ఎస్‌డీ తేజేశ్వరరావుకు సన్మానం

కర్నూలు(సెంట్రల్): పోలీసు శాఖలో సీఐగా పని చేస్తూ డీఎస్పీగా పదోన్నతి పొంది చిత్తూరుకు వెళ్తున్న ఎస్‌డీ తేజేశ్వరరావుకు బ్రాహ్మణ సేవా సంక్షేమ మిత్ర మండలి ఘన సన్మానం చేసింది. కొత్తపేటలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి నాగువలరాజశేఖర్, జిల్లా అధ్యక్షుడు ఆపన్న ప్రదీపన్న, దేవీ ఫంక్షన్ హాలు యజమాని కొలుకుల చంద్రశేఖర్ శాలువ కప్పి సత్కరించారు. సంఘం నేతలు శ్రీనివాసరాజు, నౌస్సం రామకృష్ణ, చల్ల నాగరాజుశర్మ, కరణం అనూజ్‌కుమార్, సండేల్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.